ప్రజాశక్తి
ఆదివారం 5 ఫిబ్రవరి 2023 5 విజయనగరం



ఎస్‌ఎఫ్‌ఐ పోరాట ఫలితం

ఎయు ఐదో సెమిస్టర్ పరీక్షలు వాయిదా

విజయనగరం టౌన్ : ఎస్‌ఎఫ్‌ఐ పోరాట ఫలితంగా ఐదో సెమిస్టర్ పరీక్షలు వాయిదా వేయడం విద్యార్థుల పోరాట విజయమని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా సహాయ కార్యదర్శి సి హెచ్ రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఎయు 5వ సెమిస్టర్ పరీక్షలు వాయిదా వేయాలని కోరుతూ ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు ఎయు విసి పివిజిడి ప్రసాద్ రెడ్డిని కలిసి వినతి అందజేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ ఆంధ్ర యూనివర్సిటీ పరిధిలో గల 2023 అకాడమిక్ ఇయర్ చదువుతున్న విద్యార్థులకు 5వ సెమిస్టర్ వ్రాత పరీక్ష తేదీలను యూనివర్సిటీ కొద్దిరోజుల క్రితమే ఖరారు చేశారని, 4వ సెమిస్టర్ రాత పరీక్షలు పూర్తయి మూడు నెలలు గడుస్తున్నా ఇంటర్న్‌షిప్ పేరుతో విద్యార్థులను తీవ్ర ఇబ్బందులు పెట్టి రెండు నెలలపాటు తరగతులకు దూరం చేసి సెమిస్టర్ పరీక్షలకు సిద్ధం కావాలని చెప్పడం అన్యాయమని తెలిపారు. ఫిబ్రవరి 10 నుంచి జరగనున్న 5వ సెమిస్టర్ పరీక్షలను మార్చి రెండో వారానికి మార్చాలని కోరారు. దీనికి విసి స్పందించి పరీక్షలు వాయిదా వేశారని తెలిపారు.

పతివాడ అలక

- టిడిపి నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా కర్రోతు
- బంగార్రాజుకు అందని మాజీ మంత్రి ఆశీర్వాదం
- నిరాశతో వెనుదిరిగిన నూతన ఇన్‌ఛార్జి

కర్రోతు బంగార్రాజును అభినందిస్తున్న నెల్లిమర్ల నాయకులు, కార్యకర్తలు

ప్రజాశక్తి- నెల్లిమర్ల

టిడిపి నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా కర్రోతు బంగార్రాజును పార్టీ అధిష్టానం నియమించడం పట్ల మాజీ మంత్రి పతివాడ నారాయణస్వామినాయుడు అలకబూనారు. పార్టీకి సుదీర్ఘకాలంగా సేవలందించిన తన కుటుంబ సభ్యులకు గాని, సీనియర్ నాయకులకు గాని బాధ్యతలు అప్పగించకపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. సుదీర్ఘ కాలంగా నెల్లిమర్ల నియోజకవర్గ ఇంఛార్జి పదవిపై నెలకొన్న ఉత్కంఠకు అధిష్టానం ఎట్టకేలకు తెరదించుతూ భోగాపురానికి చెందిన టిడిపి రాష్ట్ర కార్యదర్శి కర్రోతు బంగార్రాజుకు ఆ పదవిని కట్టబెట్టింది. నియోజకవర్గంలో ఏడుసార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించిన పతివాడ నారాయణస్వామి నాయుడు ప్రస్తుతం ఇంఛార్జిగా వ్యవహరిస్తున్నా ఆయన వయస్సు మీద పడటంతో గతేడాదిగా అతను రాజకీయాల్లో చురుగ్గా పాల్గొనలేకపోతున్నాడు. దీంతో ఆ పదవి కోసం నాలుగు మండలాలు నుంచి నలుగురు నాయకులు పోటీ పడ్డారు. దీన్ని పరిశీలించిన అధిష్టానం కర్రోతు బంగార్రాజును నియమించింది.

ఇన్‌ఛార్జి కావాలని పట్టుబట్టిన ఆ నలుగురు

వాస్తవానికి నెల్లిమర్ల నియోజకవర్గంలో గతేడాది నుంచి నలుగురు వ్యక్తులు ఇంఛార్జి పదవి కోసం పోటీ పడుతున్నారు. మాజీమంత్రి పతివాడ నారాయణస్వామి నాయుడు తన మనవుడు తారకరామానాయుడుకు ఇంఛార్జీ పదవి ఇవ్వాలని పట్టుబట్టాడు. ఈ నేపథ్యంలో ఇటీవల మంగళగిరి పార్టీ ఆఫీసులో చంద్రబాబును కూడా కలిశారు. కాగా నెల్లిమర్ల మండలం నుంచి మండల పార్టీ అధ్యక్షులు కడగల ఆనంద్‌కుమార్, డెంకాడ నుంచి మాజీ ఎంపిపి కంది చంద్రశేఖర్‌రావు, భోగాపురం నుంచి మాజీ మంత్రి కర్రోతు బంగార్రాజు ఈ పదవిని ఆశించారు. అయితే ఎట్టకేలకు అధిష్టానం బంగార్రాజు పేరును ఖరారు చేసింది.

కర్రోతును కలిసేందుకు పతివాడ నిరాకరణ

నియోజకవర్గ ఇంఛార్జి బాధ్యతను కర్రోతు బంగార్రాజుకు అప్పగిస్తూ అధినాయకత్వం నిర్ణయం తీసుకోవడంతో ఆయన అభిమానుల్లో సందడి నెలకొంది. దీంతో శనివారం ఉదయం నుంచే పోలిపల్లి చేరుకుని కర్రోతుకు శుభాకాంక్షలు చెప్పారు. అనంతరం ఆయన మాజీ మంత్రి పతివాడ నారాయణస్వామి నాయుడు ఆశీర్వాదం తీసుకునేందుకు రెల్లివలస వెళ్లారు. అయితే ఆయన్ను ఇంటిలోకి కూడా పతివాడ రానివ్వలేదని సమాచారం. అతని కుటుంబ సభ్యులకు కాకుండా వేరే వ్యక్తికి బాధ్యతలు అప్పగించడంపై ఆయన అసహనం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఏడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి, పార్టీ పుట్టినప్పటి నుంచి జెండా మోస్తున్న తనకు కాకుండా వేరే వ్యక్తికి పట్టం కట్టడంతో అధిష్టానంపై ఆయన గుర్రుగా ఉన్నట్లు తెలిస్తోంది. అయితే తనకు ముందుగా చెప్పి ఉంటే బాగుండేదని నాయకుల వద్ద ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ నాయకులతో సమావేశమై తన నిర్ణయం చెబుతానని ప్రకటించారు. దీంతో కర్రోతు అక్కడి నుంచి నిరాశతో వెనుదిరిగారు.

పార్టీ నిర్ణయాన్ని అంగీకరించలేం

మాజీ మంత్రి పతివాడ

పూసపాటిరేగ : సీనియర్లను విస్మరించి జూనియర్‌ని ఇంచార్జిగా నియమించే పార్టీ నిర్ణయం అంగీకరించలేమని మాజీ మంత్రి పతివాడ నారాయణ స్వామినాయుడు టిడిపి రాష్ట్ర కార్యదర్శి మహంతి చిన్నంనాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. నెల్లిమర్ల నియోజకవర్గం టిడిపి ఇన్‌చార్జిగా పతివాడ నారాయణ స్వామిని తొలగించి, కర్రోతు బంగారాజును అధిష్టానం శుక్రవారం రాత్రి ప్రకటించిన విషయం తెలిసిందే. దీంతో పతివాడ తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. శనివారం ఉదయం ఆశీస్సులు తీసుకోవాలని పతివాడ ఇంటికి వెళ్లిన బంగారాజును తిరస్కరించారు. అనంతరం పతివాడ విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారుగా నాలుగు దశాబ్దాలు పార్టీ కోసం పనిచేసిన తనకు ఇచ్చిన గౌరవం ఇదేనా అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఇన్‌చార్జిని ప్రకటించినప్పుడు కనీసం ఒక్క మాటైనా చెప్పారా...? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు రోజులు క్రితం అధినేత చంద్రబాబును కలసినప్పుడు మిమ్మల్ని ఇంచార్జిగా తప్పిస్తున్నామని చెప్పొచ్చుకదా అని ప్రశ్నించారు. అంటే తాము ఎందుకూ పనికిరానివాళ్లమా అన్నారు. తమను నమ్ముకొని ఉన్న కార్యకర్తలకు ఏమి సమాధానం చెప్పాలన్నారు. రాష్ట్ర కార్యదర్శి మహంతి చిన్నంనాయుడు మాట్లాడుతూ తాను 5సార్లు ఎంపిపిగా పనిచేసినా పార్టీ తనకు ఇచ్చే గౌరవం ఎక్కడుందన్నారు. ఒక్కసారి ఎంపిపి అయిన వారికి ఇంఛార్జి ఇస్తే ఎలా అన్నారు. అర్థాంతరంగా అర్ధరాత్రి ఇన్‌చార్జిని ప్రకటించాల్సిన అవసరం ఏమొచ్చిందన్నారు. ఈ నిర్ణయం జీర్ణించుకోలేక పోతున్నామని, కార్యకర్తల అభిప్రాయం ప్రకారం భవిష్యత్ కార్యాచరణ ఉంటుందని అన్నారు. ఈ సమావేశంలో మండల పార్టీ అధ్యక్షులు మహంతి శంకారావు, నాయకులు పతివాడ అప్పలనారాయణ, ఆకిరి ప్రసాదరావు, పతివాడ తమ్మునాయుడు, పతివాడ అప్పలనాయుడు, నియోజకవర్గం టిడిపి మహిళా అధ్యక్షులు చిల్లపద్మ, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక హోదాపైనే తొలి సంతకం

కాంగ్రెస్ ర్యాలీలో పిసిసి అధ్యక్షులు రుద్రరాజు

ర్యాలీలో పాల్గొన్న పిసిసి అధ్యక్షులు రుద్రరాజు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు

ప్రజాశక్తి-విజయనగరం కోట

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రాహుల్ గాంధీ అయితే రాష్ట్రానికి ప్రత్యేక హోదాపైనే తొలి సంతకమని పిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు తెలిపారు శనివారం స్థానిక కాంగ్రెస్ కార్యాలయం నుంచి బాలాజీ కూడలి వరకు నిర్వహించిన పాదయాత్రకు ముందు జెండాను ఎగరవేశారు. భారత జూడో యాత్ర లో రాహుల్ గాంధీ చేసిన వాగ్దానాలకు సంబంధించిన ఫ్లెక్సీని, కరపత్రాలను ఆవిష్కరించారు. ముందుగా స్థానిక వెంకటేష్ స్వామి దేవాలయం దర్శించుకుని అనంతరం పాదయాత్రను ప్రారంభించారు. చేయి చేయి కలుపుదాం.. రాహుల్ గాంధీ నాయకత్వాన్ని బలపరుద్దాం అంటూ కార్యకర్తలు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకు వెళ్తామని అన్నారు. తెలుగు బిడ్డ పివి నరసింహారావు ప్రత్యేకించి విశాఖ స్టీల్ ప్లాంట్ కు నాలుగువేల కోట్ల రూపాయలు కేటాయించి ప్రత్యేకమైన అభివృద్ధి చేశారని అన్నారు. అలాంటి పరిశ్రమను నేడు బిజెపి ప్రభుత్వం ప్రైవేటు పరం చేసేందుకు పూనుకుందని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుతామని అన్నారు. రానున్న రెండేళ్లలో రాహుల్ గాంధీ పిలుపుమేరకు ప్రతి నియోజకవర్గంలో ప్రతి గ్రామంలో ఇంటింటికి వెళ్లి ప్రజల కష్టసుఖాలు తెలుసుకుంటామన్నారు. అనంతరం బాలాజీ జంక్షన్లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తూ నివాళు లర్పించారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర జిల్లాల వర్కింగ్ ప్రెసిడెంట్ రాకేష్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు సరగడ రమేష్ కుమార్, జిల్లా కార్యదర్శి డోలా శ్రీనివాస్, రాష్ట్ర మైనార్టీ సెల్ ఉపాధ్యక్షులు షరీఫ్, నగర పార్టీ అధ్యక్షులు సుంకర సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావసరాలను తీర్చే బాధ్యత ప్రభుత్వానిదే

మాజీ మంత్రులు అశోక్, కొణతాల ● ప్రభుత్వ కేన్సర్ ఆస్పత్రి సాధనకు బీశెట్టి సత్యాగ్రహ దీక్ష

శిబిరంలో అభివాదం చేస్తున్న కొణతాల, అశోక్, బీశెట్టి, తదితరులు

ప్రజాశక్తి-విజయనగరం కోట

విద్య, వైద్య రంగాల్లో పేదల అవసరాలను తీర్చే భాధ్యత ప్రభుత్వాలదేనని, వెంటనే జిల్లాకు ప్రభుత్వ కేన్సర్ ఆసుపత్రిని రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేయాలని కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజు, మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ డిమాండ్ చేశారు. కేన్సర్ ఆస్పత్రిని ఏర్పాటు చేయాలని కోరుతూ సాధన సమితి జెఎసి చైర్మన్ భీశెట్టి బాబ్జీ శనివారం మయూరి జంక్షన్‌లో ఒక్కరోజు సత్యాగ్రహ దీక్ష చేపట్టారు. దీక్షకు టిడిపి, వైసిపి, జనసేన, సిపిఐ నాయకులు మద్దతు తెలిపారు.

ఈ సందర్భంగా కేంద్ర మంత్రి అశోక్ మాట్లాడుతూ ఎప్పుడో సమసిపోయిందని చెప్పి మళ్లీ కుష్ఠు వ్యాధి కోసం ఆలోచిస్తున్న పాలకులు అత్యధికంగా కేన్సర్ మరణాలు సంభవిస్తున్న జిల్లాలో ప్రభుత్వ కేన్సర్ ఆసుపత్రి మంజూరు చేయాలని కోరారు. కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ వెనుక బడిన గిరిజన, మైదాన ప్రాంతాల్లో ప్రతీ 50మందిలో ఒక కేన్సర్ రోగి ఉన్నాడని, సరైన వైద్య సౌకర్యాలు లేక మరణాలు సంభవిస్తున్నాయని అన్నారు. రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు, సిపిఐ నాయకులు పి.కామేశ్వరరావు, వైసిపి నాయకులు పిళ్లా విజయకుమార్, అవునాపు విజయ్, బిజెపి నాయకులు కుసుమంచి సుబ్బారావు, ఉత్తరాంధ్ర చెరువుల రక్షణ సమితి మరిశర్ల కృష్ణమూర్తి నాయుడు జనసేన నాయకులు గురాన అయ్యలు, హెల్పింగ్ హాండ్స్ హిజ్రా అసోసియేషన్ వ్యవస్థాపకుడు దవడ కొండబాబు తదితరులు మద్దతు తెలిపారు.

వైద్యుల నివేదిక అత్యంత కీలకం

జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయికల్యాణ చక్రవర్తి

మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయికల్యాణ చక్రవర్తి

ప్రజాశక్తి-విజయనగరంలీగల్

వైద్యులు చేసే క్రిమినల్ ఇన్‌వెస్టిగేషన్, ఎవిడెన్స్ రిపోర్టు అత్యంత కీలకమని, జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయి కల్యాణ చక్రవర్తి పేర్కొన్నారు. న్యాయమూర్తులు ఇచ్చే తీర్పులు, ఈ రిపోర్టులపై ఆధారపడి ఉంటాయని చెప్పారు. నాణ్యతతో కూడిన నేర విచారణ జరగాలని, అత్యంత ఖచ్చితమైన రిపోర్టులను అందజేయాలని సూచించారు. జిల్లా కోర్టు సముదాయంలోని న్యాయసేవా సదన్‌లో, నల్సా వారి సహకారంతో, క్రిమినల్ ఇన్‌వెస్టిగేషన్, ఎవిడెన్స్ రిపోర్టులపై, వైద్యులకు, వైద్యాధికారులకు, ప్రొఫెసర్లకు, శనివారం న్యాయ అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయికల్యాణ చక్రవర్తి మాట్లాడుతూ, నేర విచారణ, సాక్ష్యాల నివేదికలను రూపొందించే విషయంలో అవగాహన కల్పించారు. డాక్టర్లు ఇచ్చే నివేదికలు, కేసు పూర్వాపరాలను అనుసరించి, న్యాయమూర్తులు తీర్పులను ఇస్తారని చెప్పారు. ఎట్టిపరిస్థితిలోనూ తప్పు చేసినవారు బయట తిరగకూడదని, కేసు, శిక్ష నుంచి తప్పించుకోకూడదని స్పష్టం చేశారు. నేర విచారణ, రిపోర్టులు ఇచ్చే విషయంలో డాక్టర్లు పూర్తిగా భాగస్వాములై, అత్యంత నాణ్యతతో కూడిన నివేదికలను అందజేయాలని సూచించారు. దీనివల్ల నేరాల రేటు కూడా తగ్గుతుందని అన్నారు. సదస్సులో అదనపు జిల్లా న్యాయమూర్తి కె.రాధారత్నం, నాల్గవ అదనపు జిల్లా న్యాయమూర్తి షేక్ సికిందర్ భాషా, జిల్లా న్యాయసేవల సంస్థ కార్యదర్శి బిహెచ్‌వి లక్ష్మీకుమారి, జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ వేలూరి రఘురామ్ తదితరులు పాల్గొని, పలు అంశాలను వివరించారు.

సిపిఎస్ రద్దుకు నేడు కలెక్టరేట్ వద్ద యుటిఎఫ్ దీక్ష

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సిపిఎస్ ను రద్దు చేయాలని డిమాండ్ యుటిఎఫ్ రాష్ట్ర శాఖ ఇచ్చిన పిలుపుమేరకు ఆదివారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ఒక్క రోజు దీక్షను నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి లు రమేష్ చంద్ర పట్నాయక్, జె ఎవిఆర్ కె ఈశ్వరరావు తెలిపారు. చాలా రాష్ట్ర ప్రభుత్వాలు సిపిఎస్‌ను రద్దు చేశాయన్నారు. ముఖ్యమంత్రి జగన్ అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లో సిపిఎస్ ను రద్దు చేస్తామని హామీ ఇచ్చినప్పటికీ అమలు చేయకపోవడం అన్యాయమన్నారు. ఆదివారం జరిగే దీక్షకు ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

దన్నానపేట కొండపై పనులు నిలుపుదల

ప్రజాశక్తి - నెల్లిమర్ల

దన్నానపేట కొండపై జరుగుతున్న అక్రమ పనులు నిలుపుదల చేసినట్లు తహశీల్దార్ కె.వి.రమణ రాజు తెలిపారు. శనివారం ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ ఇటీవల దన్నాన పేట కొండ సర్వే నెంబర్ 88లో అక్రమ నిర్మాణాలు తవ్వకాలు జరుపుతున్నట్లు ప్రజాశక్తిలో వార్త రావడంతో వెంటనే చర్యలు తీసుకొని నిలుపుదల చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వ స్థలాల్లో ఎటువంటి అక్రమాలు జరిపినా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఉపాధి పనుల పరిశీలన

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని రామస్వామిపేటలో చేపడుతున్న ఉపాధి హామీ పనులను ఎంపిడిఒ బిఎస్‌కెఎన్ పట్నాయక్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ కూలీలతో మాట్లాడారు. కొలతల ప్రకారం రెండు పూటలా పనిచేస్తే కూలి గిట్టుబాటు అవుతుందని సూచించారు. కార్యక్రమంలో జెఇ దేవుడుబాబు, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

త్వరలోనే పైడితల్లి ఆలయ అభివృద్ధి

డిప్యూటీ స్పీకర్ కోలగట్ల ● ఆలయ సమీప దుకాణాలు, గృహ యజమానులకు చెక్కులు అందజేత

చెక్కు అందజేస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

సాంకేతిక ప్రక్రియలు పూర్తయిన వెంటనే పైడితల్లి ఆలయ అభివృద్ధి పనులను ప్రారంభిస్తామని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పేర్కొన్నారు. మార్చి నెల ప్రారంభం నాటికి సమీపంలోని దుకాణాలను ప్రత్యామ్నాయ ప్రాంతానికి తరలించి సంబంధిత అభివృద్ధి పనులకు అంకురార్పణ చేయనున్నట్లు వెల్లడించారు. ఆలయాన్ని విస్తరించి భక్తుల సౌకర్యార్థం మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. ఈ మేరకు ఆలయ ప్రాంగణంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. దేవాదాయ శాఖ రాష్ట్ర స్థాయి అధికారులతో కూడా మాట్లాడామని.. ఈ మేరకు ఆలయ సమీపంలోని దుకాణాలు, గృహ యజమానులకు ఆర్థిక పరిహారం అందజేసేందుకు, వారి దుకాణాలను ప్రత్యామ్నాయ చోటుకు తరలించేందుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. అభివృద్ధి చర్యల్లో భాగంగా మార్చి ఒకటో తేదీ నాటికి సమీపంలోని యజమానులు వారి భవనాలను అప్పగించినున్నారని తెలిపారు. అనంతర ఆలయ అభివద్ధికి స్థలాలు ఇచ్చిన దుకాణాలు, గృహ యజమానులకు డిప్యూటీ స్పీకర్ చేతుల మీదుగా చెక్కులు పంపిణీ చేశారు. సమావేశంలో దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ కిషోర్ కుమార్, సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

నగరంలోని 60 లక్షల రూపాయలతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి శంకుస్థాపన చేశారు. కొత్తపేట రాధాకృష్ణ కళ్యాణమండపం సమీపంలో రూ.21 లక్షలతో ఏర్పాటు చేయనున్న రహదారికి, 17వ డివిజన్లో రూ. 18 లక్షలతో చేపట్టిన రహదారి నిర్మాణానికి, 35 డివిజన్లో రూ.22 లక్షలతో నిర్మించనున్న రహదారి, కల్వర్టుల నిర్మాణానికి ఆయన శంకుస్థాపనలు చేశారు. వైసిపి నగర అధ్యక్షులు ఆశపు వేణు, డిప్యూటీ మేయర్ రేవతి దేవి, ముద్దాడ మధు, ఇసరపు రామకష్ణ, చందక శ్రీనివాస్, కుమ్మర గంటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన మౌలిక వసతుల కల్పన

టిడ్కో చైర్మన్ జమ్మాన

విజయనగరం : విజయనగరం పరిధిలోని సారిపల్లి, సోనియా నగర్‌లో నిర్మించిన టిడ్కో గృహ సముదాయాలను లబ్ధిదారులు, అధికారులతో కలిసి టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్న కుమార్ శనివారం సందర్శించారు. అక్కడ జరుగుతున్న పనులను, మౌలిక వసతుల కల్పనను పరిశీలించారు. ఇక్కడ నిర్మించిన 2,976 గృహాలకు సంబంధించి మార్చి నెలలో ప్రవేశాలు కల్పించేలా పనులు పూర్తి చేయాలని అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. ఇప్పటికే నివాసం ఉంటున్న లబ్ధిదారులతో మాట్లాడారు. అక్కడ ఉన్న పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. తాగునీరు, విద్యుత్ సదుపాయానికి సంబంధించి మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను, కాంట్రాక్టు ఏజెన్సీ ప్రతినిధులను ఆదేశించారు. ఇప్పటి వరకు జరిగిన పనుల ప్రగతిపై అధికారులను అడిగి తెలుసుకున్న ఆయన పనుల్లో మరింత పురోగతి సాధించాలని నిర్దేశించారు. టిడ్కో సూపరింటెండింగ్ ఇంజనీర్ నరసింహ మూర్తి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జ్యోతి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బాలకృష్ణ, సిఎల్‌టిసి శ్రీనివాసరావు, మున్సిపల్ అధికారులు, కాంట్రాక్టు ఏజెన్సీ ప్రతినిధులు పాల్గొన్నారు.

రామతీర్థంలో ఘనంగా రథయాత్ర

ప్రజాశక్తి - నెల్లిమర్ల

రామతీర్థం రామస్వామి దేవస్థానంలో సీతారామ స్వాముల రథయాత్ర శనివారం రాత్రి ఘనంగా జరిగింది. రామస్వామి దేవస్థానంలో అర్చకులు వెండి మందిరంలో ప్రాతఃకాల అర్చన జరిపించి భక్తులకు దర్శనం జరిపారు. ఈ నెల 1న జరిగిన సీతారాముల కళ్యాణంలో భాగంగా రథయాత్ర జరపడం ఆనవాయితీగా వస్తుంది. వార్షిక కళ్యాణ ఉత్సవ మూర్తులు సీతా లక్షణ సమేత రామ స్వామిని గరుడ, హంస, అశ్వ వాహనంపై సీతా రాముని పేటకు చెందిన భక్తులు కోలాటాలు, మేళా తాళాలతో పురవీధుల్లో ఊరేగించి తిరిగి దేవస్థానంలోకి తీసుకు వచ్చారు. అంతక ముందు ఉద్దండ వేద పండితులచే పండిత పరిషత్ నిర్వహించారు. దేవస్థానం సహాయ కమిషనర్ డి.వి.వి.ప్రసాద్ పర్యవేక్షణలో ప్రధానార్చకులు ఖండవిల్లి సాయిరామాచార్యులు, అర్చకులు గోడ వర్తి నరసింహాచార్యులు, ఖండవిల్లి కిరణ్, పాణంగి పల్లి ప్రసాద్ పూజలు నిర్వహించారు.

సిఐటియులో చేరిన కార్మికులతో నాయకులు

సిఐటియులో చేరిన ఆటో కార్మికులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాష్ట్రంలో లక్షలాది మంది ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరుతూ సిఐటియు పోరాడుతోందని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, శ్రీ కనక దుర్గ ఆటో యూనియన్ గౌరవ అధ్యక్షులు రెడ్డి శంకరరావు, సిఐటియు నగర కార్యదర్శి బి. రమణ కార్మికులకు పిలుపు నిచ్చారు. విజయ నగరం మెడికల్ కాలేజీ వద్ద 30 మంది ఆటో కార్మికులు శనివారం సిఐటియులో చేరారు. ఈ సందర్భంగా సిఐటియు జెండాను శంకర్రావు ఎగురవేశారు. కార్యక్రమంలో పెయింటింగ్ సంఘం అధ్యక్షులు, కంది త్రినాథ్, స్టాండ్ ప్రెసిడెంట్ సురేష్, నాయకులు నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్‌ఆర్‌ఎస్‌ను రద్దు చేయాలని ధర్నా

ప్రజాశక్తి- వంగర



ధర్నా చేస్తున్న కార్మికులు, సిఐటియు నాయకులు

ముఖ ఆధారిత హాజరు విధానాన్ని వెంటనే రద్దు చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి సిహెచ్ రామ్మూర్తి నాయుడు డిమాండ్ చేశారు. రాజాం మున్సిపల్ కార్యాలయం వద్ద శనివారం జరిగిన ధర్నాలో ఆయన మాట్లాడుతూ మున్సిపల్ సిబ్బందిలో అత్యధికంగా స్మార్ట్ ఫోన్‌లకు సంబంధించి నైపుణ్యం లేని కార్మికులున్నారని చాలా మందికి స్మార్ట్ ఫోన్‌లు లేవని చెప్పారు. అటువంటి వారిని స్వయంగా మీరే ఎఫ్‌ఆర్‌ఎస్ తీసి పంపిస్తేనే హాజరు పడుతుంది, హాజరు పడితేనే జీతాలు వస్తాయని చెప్పడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు రాజేష్, శంకర్రావు, చినబాబు, కృష్ణ, గిరి, అనిల్ కుమార్, కనకరాజు, గోపి, సింహాచలం, రవి, సుధాకర్, గురువులు, సుగుణమ్మ పాల్గొన్నారు.

ఓపెన్ చెస్ ఛాంపియన్‌షిప్ పోటీలకు 11,12 తేదీల్లో ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అండర్ 15 చదరంగం రాష్ట్రస్థాయి పోటీలకు ఈనెల 11,12 తేదీల్లో చెస్ అసోసియేషన్ ఆఫ్ విజయనగరం అధ్వర్యంలో ఎంపికలు నిర్వహిస్తామని అసోసియేషన్ కార్యదర్శి జ్వాలాముఖి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలు విజయనగరం తోటపాలెంలోని ఫైర్ చెస్ స్కూల్ లో నిర్వహిస్తామని పేర్కొన్నారు. క్రీడాకారులు 1-1-2008 తర్వాత పుట్టిన వారు అర్హులని, పోటీలకు వచ్చిన క్రీడాకారులు తప్పనిసరిగా వారి జనన ధ్రువీకరణ పత్రం తీసుకు రావాలని కోరారు. పోటీలలో ఓపెన్‌లో బాలురులో నలుగురు, బాలికల్లో నలుగురిని ఎంపిక చేసి రాష్ట్రస్థాయి పోటీలకు పంపుతామని తెలిపారు. పూర్తి వివరాలకు 94909 48730, 87904 64569 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

మూగబోయిన అధికార, ప్రతిపక్ష గళం



ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

మౌనం అర్థంగీకారం అంటారు పెద్దలు. ఇంకా చెప్పాలంటే మేధావుల మౌనం సమాజాభివృద్ధికి ఆటంకం అనికూడా మరికొందరు వ్యాఖ్యానిస్తుంటారు. పోరాడితే పోయేదేముంది బానిస సంకెళ్లు తప్ప అని కూడా చెబుతుంటారు విప్లవబాట పట్టినవారు. అడక్కపోతే అమ్మయినా పెట్టదంటారు సానుకూల ధృక్పదంతో ఇంకొందరు. కానీ, ఇవేవీ పట్టలేదు మన జిల్లాలోని అధికార, ప్రతిపక్ష పార్టీలకు, నాయకులకు. ఔను నిజమే...! కేంద్ర బడ్జెట్ కేటాయింపులో బిజెపి ప్రభుత్వం కనికరం చూపకపోయినా, వివక్ష ప్రదర్శించినా, నిర్లక్ష్యపు వరదలో ముంచేస్తున్నా కనీసం నోరు మెదపలేదు. సరిగ్గా ఇవే విషయాలను, సూక్తులను, వ్యాఖ్యలను గుర్తుచేస్తూ చర్చిస్తున్నారు జనం. ఇందుకు కారణం లేకపోలేదు సుమా..! 'మన రాష్ట్రానికి, ముఖ్యంగా ఉత్తరాంధ్రకు, ప్రత్యేకించి మన జిల్లాకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చూపిన నిర్లక్ష్యం, వివక్ష అంతా ఇంతా కాదు. ఆ మోసాలు మాటల్లో చెప్పలేనివి. రాతలకు సరిపోనివి'. అంటూ జనం కథలు కథలుగా చెప్పుకుంటున్నారు. రాష్ట్రాన్ని విభజించిన కాంగ్రెస్ ప్రభుత్వం మన రాష్ట్రానికి ఐదేళ్ల ప్రత్యేక హోదా కల్పిస్తామంటే... కాదు కాదు కనీసం పదేళ్లైనా హోదా ఇవ్వాలంటూ నాటి బిజెపి ప్రభుత్వం పట్టుబట్టింది. ఇదే కాదు. అధికారంలోకి వస్తే ఏటా కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని, నల్లధనాన్ని వెలికి తీయడమే కాకుండా, అలా వెలికి తీసిన సొమ్మును ఏకంగా పేదల ఖాతాల్లోనే జమచేస్తామని కూడా బిజెపి నేతలు ప్రగల్భాలాలు పలికారు. తీరా అధికారంలోకి వచ్చాక జన్‌ధన్ అంటూ బ్యాంకు ఖాతాలను తప్పనిసరి చేశారు. ఆ తరువాత నోట్ల రద్దు, అనంతర పరిణామాల గురించి వేరేగా చెపనక్కర్లేదు. విభజన హామీలో భాగంగా వెనుక బడ్డ జిల్లాకు ఇచ్చే ప్రత్యేక నిధులనూ అర్థాంతరంగా ఆపేశారు. ఇన్నాళ్లూ ఎదురు చూసినప్పటికీ ప్రధానిగా మోడీ చివరి బడ్జెట్ ఈనెల 1వ తేదీన ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన విషయం విధితమే. ఈ బడ్జెట్‌లో విభజన హామీలు ఎలాగూ నెరవేరలేదు. కనీసం సొంత భవనం లేక అద్దె భవనంలో నడుపుతున్న కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయానికి ఇచ్చే నిధులను కూడా కేంద్రం తగ్గించేసింది. ఇక ఎయిర్‌పోర్టు, మెడికల్ కాలేజీలకు రాష్ట్ర ప్రభుత్వం ఆశించిన ఆర్థిక సాయం ఎండమావిగానే మిగిలిపోయింది. చివరకు మన జిల్లా నడిబొడ్డున ఎంతో ఆటకంగా ఉన్న మానాపురం రైల్వే వంతెన నిర్మాణానికి కూడా రూ.2లక్షలకు మించి కేటాయించలేదంటే జిల్లాపై ఎంత నిర్లక్ష్యం ప్రదర్శించిందో వేరేగా చెప్పనక్కర్లేదు. ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో ఉన్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో కేంద్ర వైఖరిపై సిపిఎం, సిపిఐ, సిఐటియు తదితర సంఘాలు మాత్రమే స్పందించాయి. వివిధ రూపాల్లో నిరసన తెలిపాయి. ఈ విషయంలో జిల్లాలో ఇతర పార్టీల గొంతు మూగబోయింది. కనీసం ప్రకటన రూపంలో కూడా ప్రశ్నించకపోవడం పట్ల యావత్తు ప్రజానీకం విస్తుపోతున్నారు. అధికార, ప్రతిపక్షాలకు ఎన్నికలు, అధికారం తప్ప రాష్ట్రంపైనా, జిల్లాపైనా కేంద్రం చేస్తున్న పరోక్షదాడి పట్టడం లేదని చర్చించుకుంటున్నారు. కనీసం ఎంపీ అయినా పార్లమెంట్ లోపల లేదా బయట నోరు మెదపకపోవడం దారుణమంటూ విమర్శలు వినిపిస్తున్నాయి. మానాపురం జాతీయ రహదారిపై తలపెట్టిన ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం కొన్ని దశాబ్దాలుగా సాగుతోంది. చిత్తశుద్ధి ఉంటే కొన్ని నెలల్లో పూర్తిచేసేందుకు అవకాశం ఉంది. కానీ, స్థానిక ఎమ్మెల్యేగానీ, ఎంపీగానీ, రాష్ట్రంలోని మంత్రులుగాని కేంద్రాన్ని కనీసం ప్రశ్నించకపోవడం వల్ల రైల్వే శాఖ పట్టించుకోవడం లేదన్న విమర్శలు గుప్పిస్తున్నాయి. ఇలా వారు వీరు అని కాదు. జిల్లాలోని అందరి ఎమ్మెల్యేల తీరు ఇలాగే ఉంది. రాష్ట్ర విభజన హామీలు, ముఖ్యంగా ప్రత్యేక హోదా అమలు చేయాలంటూ విద్యార్థి, యువజన సంఘాలు చేపట్టిన యాత్ర జిల్లాకు చేరినప్పుడు కూడా అధికార, ప్రతిపక్ష పార్టీలకు కనీసం సంఘీభావం తెలియజేయక పోవడంతో విధానాల విషయంలో దొందూ దొందే అన్నట్టుగా వ్యవహరిస్తున్నాయని పబ్లిక్ టాక్.

మహిళలకు సైబర్ సెక్యూరిటీపై అవగాహన

ప్రజాశక్తి- డెంకాడ

చింతలవలస ఎంవిజిఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ ఆధ్వర్యంలో 'మహిళలపై సైబర్ దాడులు అండ్ సైబర్ మోసాలను ఎదుర్కోవడం' అనే అంశంపై జెఎన్‌టియు డిజిటల్ మానిటరింగ్ సెల్‌తో కలిసి డైరెక్టరేట్ ఆఫ్ ఉమెన్ అండ్ గ్రీవెన్స్ ద్వారా ఆన్‌లైన్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రిసోర్స్ పర్సన్ డాక్టర్ ఎ.ఎస్.ఎన్. చక్రవర్తి, ఎస్‌డిసి, డబ్ల్యుడిసి అండ్ డిఎంసి జెఎన్‌టియు కాకినాడ సిఎస్‌ఇ ప్రొఫెసర్, ప్రత్యేక అధికారి ప్రసంగించారు. సైబర్ నేరాలు జరిగే తీరు, బెదిరింపులపై ఆయన క్షుణ్నంగా వివరించారు. కొన్ని యాప్‌లకు విద్యార్థులు దూరంగా ఉండాలని సూచించారు. ఈ అవగాహన కార్యక్రమంలో ఎంవిజిఆర్ ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ కన్వీనర్ డాక్టర్ ఎం. సారా కమల కుమారి, వివిధ విభాగాల డబ్ల్యుఇసి కోఆర్డినేటర్లు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సిఎ ఫలితాల్లో ఆర్ఎస్ అకాడమీ ప్రభంజనం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

శనివారం విడుదల అయిన సిఎ, సిఎంఎ ఫౌండేషన్ ఫలితాల్లో నగరంలోని అర్ఎస్ అకాడమీ విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించి ప్రభంజనం సృష్టించారు. సిఎ లో ఎస్.స్నేహలతకు 269, ఎస్,నితిన్ కు 247 మార్కులు వచ్చాయి. సిఎంఎ లో వివి శ్రీధర్ 326, ఎన్.గాయత్రి 312, బిఎస్‌కె శ్రీనివాసు 306 మార్కులు సాధించారు. వీరిని అర్ఎస్ అకాడమీ డైరెక్టర్ అంట్యాకుల రమేష్ అభినందించారు.

లింగ వివక్షను రూపుమాపాలి

ప్రజాశక్తి-విజయనగరం

రాష్ట్రంలో సుస్థిర అభివృద్ధికి బాల్య వివాహాలు అవరోధంగా ఉన్నాయని సామాజిక, పరివర్తన మార్పు సమాచార వ్యవస్థ జిల్లా సమన్వయ అధికారి బి.రామకృష్ణ అన్నారు. జిల్లా కలెక్టర్ ఎ.సూర్యకుమారి ఆదేశాల మేరకు జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ సూచనలతో శనివారం కస్పా మున్సిపల్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బాల్య వివాహాల నిర్మూలన, లింగ వివక్ష, రక్తహీనత, పౌష్టికాహారం,జంక్ ఫుడ్ వల్ల కలిగే ప్రమాదాలు, ఉన్నత లక్ష్యాలు తదితర అంశాలపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు.కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఆర్. శంకరరావు , మహిళా సంరక్షణ కార్యదర్శి గాయత్రి, ఎ ఎన్ ఎం సుహాసిని, ఆశా కార్యకర్త కనక మహాలక్ష్మి,పిఇటి ఈశ్వర్, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంఎల్ఎస్ పాయింట్ తనిఖీ

ప్రజాశక్తి- రేగిడి

రేషన్ సరుకులు ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద తూనికలు వేసి డీలర్లకు అందజేయాలని డిప్యూటీ తహశీల్దార్ బి. గోవిందరావు అన్నారు. శనివారం ఆర్. ఆమదాలవలస కాలనీ వద్ద ఉన్న ఎంఎల్ఎస్ పాయింట్‌ను ఆయన తనిఖీ చేశారు. ముందుగా సరుకులు వివరాలు అడిగి తెలుసుకుని రికార్డులు పరిశీలించారు. డీలర్లు ఎమ్ఎల్‌యస్ పాయింట్‌కు వస్తేనే సరుకులు అందజేయాలని సూచించారు. డీలర్లకు సరుకులు వెళ్లిన వెంటనే రికార్డులో తప్పక నమోదు చేయాలన్నారు. ఇచ్చిన సరుకులలో తేడాలు వస్తే శాఖ పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయనతో పాటు వంగర సిఎస్‌డిటి, డీలర్లు ఉన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

ప్రజాశక్తి-బొబ్బిలి

రక్తదానం చేస్తే ప్రాణదానం చేసినట్లేనని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు అన్నారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో శనివారం రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తం కొరతతో అనేకమంది గర్భిణులు, ప్రమాదాల్లో గాయపడిన వారు మరణిస్తున్నారని తెలిపారు. రక్తం కొరతను నివారించేందుకు రక్తదానం చేసేందుకు యువత ముందుకు రావాలని కోరారు. రక్తదానంపై అపోహలు వీడాలని సూచించారు. ఈ సందర్భంగా రక్తదానం చేసిన యువతను అభినందించారు. శిబిరంలో 30మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి జి.శశిభూషణరావు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

పోటీతత్వాన్ని అలవర్చుకోవాలి

ప్రజాశక్తి-కొత్తవలస

ప్రతి విద్యార్థి పోటీతత్వాన్ని అలవర్చుకోవాలని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు కోరారు. ప్రగతి విద్యాసంస్థల డైరెక్టర్ వి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గత నెల 22న పదో తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ టెస్ట్ లో 800 మంది విద్యార్థులు పాల్గొన్నారు. తెలిపారు. అందులో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు శనివారం ఎమ్మెల్యే నగదు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పరీక్షా సమయంలో ఒత్తిడి వద్దు

ప్రజాశక్తి-నెల్లిమర్ల

విద్యార్థులు పరీక్షా సమయంలో ఒత్తిడికి గురి కాకూడదని బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్ పర్సన్ కేసలి అప్పారావు అన్నారు. శనివారం స్థానిక బి.ఆర్.అంబేడ్కర్ గురుకుల పాఠశాలను ఆయన సందర్శించి విద్యా విధానం, మౌలిక సదుపాయాల పై ఆరా తీశారు. ఫిర్యాదులు పెట్టేను పరిశీలించి, వచ్చిన ఫిర్యాదులను రికార్డ్ చేయాలని, మహిళా పోలీస్ సిబ్బంది తరుచుగా పర్యవేక్షణ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. అనంతరం వేర్వేరుగా ఉపాధ్యాయ సిబ్బంది, బోధనేతర సిబ్బంది, సెక్యూరిటీ సిబ్బందితో సమావేశమై బాలల గురుంచి చర్చించారు. తల్లి దండ్రులు, కుటుంబ సభ్యులు తప్ప ఇతరులను పాఠశాల ఆవరణలోకి అనుమతించరాదని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ కె.ఉషారాణి పాల్గొన్నారు.

సర్వీసులు అందుబాటులో ఉంచాలి

ప్రజాశక్తి- రేగిడి

ప్రభుత్వ సర్వీసులు అందుబాటులో ఉంచి, ప్రజలకు అవగాహన కల్పించాలని మండల ప్రత్యేక అధికారి పెంటోజి రావు అన్నారు. శనివారం ఉంగరాడ గ్రామ సచివాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా శాఖల వారీగా పనితీరును అడిగి తెలుసుకున్నారు. సచివాలయ ఉద్యోగులు ప్రజలతో మమేకం కావాలని అన్నారు. అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలకు దరఖాస్తు స్వీకరించి ఆన్‌లైన్‌లో పొందుపర్చాలని చెప్పారు.

నేడు వైసిపి మండల స్థాయి సమావేశం

ప్రజాశక్తి-వేపాడ

వేపాడ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం వైసిపి మండల స్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షులు ఎం.జగన్నాథం తెలిపారు. ఈ సమావేశానికి జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు హాజరవుతారని చెప్పారు. మండలంలోని జెడ్‌పిటిసి, ఎంపిపి, ఎంపిటిసిలు, సర్పంచులు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వాలంటీర్లు హాజరుకావాలని కోరారు.

కంటి వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని జాకేరులో శనివారం ఏర్పాటు చేసిన కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఆప్తాలమిస్టు సిహెచ్ ఈశ్వరరావు కంటి పరీక్షలు చేశారు. సర్పంచ్ బుద్ధ చిన్నమ్మలు, గ్రామ నాయకులు బుద్ధ అప్పలనాయుడు చేతుల మీదుగా కంటి అద్దాలు పంపిణీ చేశారు. ఎఎన్ఎం బి.లక్ష్మి, ఆశావర్కర్ బి.గౌరి, వాలంటీర్ శివ పాల్గొన్నారు.

'ఎన్నికల్లో టిడిపి విజయానికి కృషి '

ప్రజాశక్తి - నెల్లిమర్ల

రాబోయే ఎన్నికల్లో టిడిపి విజయానికి మరింత కృషి చేస్తామని జరజాపుపేటకు చెందిన పట్టణ టిడిపి ప్రధాన కార్యదర్శి, నగర పంచాయతి కౌన్సిలర్ అవనాపు సత్యనారాయణ అన్నారు. టిడిపి నియోజకవర్గం ఇంఛార్జిగా నియమితులైన కర్రోతు బంగార్రాజుని శనివారం కలిసి అభినందించారు. ఈ సందర్భంగా అవనాపు సత్యనారాయణ మాట్లాడుతూ కర్రోతు బంగార్రాజు నాయకత్వంలో పార్టీనీ మరింత పటిష్ట పరిచి టిడిపి అధికారంలోకి తీసుకు వస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. ముఖ్యంగా అధికార పార్టీ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ఎండగడతామని కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని అవనాపు కోరారు. కర్రోతును అభినందించిన వారిలో నాయకులు కింతాడ కళావతి, బోలె కృష్ణ, తుమ్ము దుర్గా రావు, తదితరులు పాల్గొన్నారు.

సక్రమంగా అంగన్వాడీ కేంద్రాల నిర్వహణ

ప్రజాశక్తి-కొత్తవలస

అంగన్వాడీ కేంద్రాల నిర్వహణ సక్రమంగా ఉండాలని మండల ప్రత్యేకాధికారి ఆర్.పాపారావు తెలిపారు. శనివారం మండల కేంద్రంలో అంగన్వాడి సూపర్వైజర్లు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిడిపిఒ ఉమాదేవి, సూపర్వైజర్లు స్వర్ణలత, రమణమ్మ, ఇఒపిఆర్‌డి కె.ధర్మారావు, ఎపిఎం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కేన్సర్‌పై అవగాహన అవసరం

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

కేన్సర్‌పై అవగాహన కలిగి అవసరమని నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి అన్నారు. శనివారం ప్రపంచ కేన్సర్ దినోత్సవ సందర్భంగా మహాత్మా గాంధీ కేన్సర్ హాస్పిటల్ , ఐఎంఎ, రోటరీ క్లబ్, ఇన్నర్ వీల్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి మహిళా కూడా స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకుని కేన్సర్ బారిన పడే ప్రమాదం నుండి బయటపడవచ్చునని అన్నారు. ఐఎంఎ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఎం.జయచంద్ర నాయుడు, మహాత్మా గాంధీ కేన్సర్ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ రజని, డాక్టర్ మృత్యుంజయరావు, ట్రాఫిక్ డిఎస్‌పిలు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆహారపు అలవాట్లను మార్చుకోవాలి అన్నారు. కార్యక్రమంలో ఐఎంఎ ప్రతినిధులు, రోటరీ క్లబ్, ఇన్నర్ వీల్ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

విజయనగరం : విద్యార్థి దశ నుంచే కేన్సర్‌పై అవగాహన ఉండాలని డాక్టర్ నవ్య అన్నారు. స్థానిక పిఎస్ ఆర్ కాంప్లెక్స్

జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న మేయర్ విజయలక్ష్మి

శ్రీ వెంకటేశ్వర జూనియర్ కళాశాలలో సామాజిక గ్రామీణ వైద్యుల సంఘం, విజయనగరం యూత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కేన్సర్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ వెంకట గుప్త, విజయ దుర్గ యూత్ సొసైటీ చంద్రిక, విజయనగరం యూత్ ఫౌండేషన్ అధ్యక్షులు షేక్ ఇల్తమస్, గ్రామీణ వైద్యుల సంఘం జిల్లా అధ్యక్షులు లెంక చిరంజీవి, కార్యదర్శి కోట్ల పైడిరాజు, కోశాధికారి ఉమాశంకర్, సహాయ కార్యదర్శి మక్కువ రమణ తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలిరూరల్ : ప్రజల్లో అవగాహన పెంచడం ద్వారా కేన్సర్ నివారణ సాధ్యమవుతుందని నారాయణప్పవలస పాఠశాల హెచ్‌ఎం జెసి రాజు అన్నారు. శనివారం పాఠశాలలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో వరల్డ్ కేన్సర్‌డేను నిర్వహించారు. కేన్సర్ గుర్తించడం, చికిత్స, నివారణ ప్రోత్సహించేలా విద్యార్థులకు అవగాహన కల్పించారు. సైన్స్ ఉపాధ్యాయులు ఎం.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు భానుప్రకాశ్, మురళి, మహేష్ పాల్గొన్నారు.

వంగర : మహమ్మరి కేన్సర్‌ను ముందుగానే గుర్తిస్తే చికిత్సని సులభంగా అందించవచ్చునని వైద్యులు గార రవి ప్రసాద్, యలకల సురేష్ కుమార్ అన్నారు. కేన్సర్ డే సందర్భంగా రాజాం పట్టణంలో గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన అవగాహన ర్యాలీలో వారు ముఖ్య అతిథులుగా హాజరై కేన్సర్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం నాయకులు ఉగిరి ముత్యాల నాయుడు, చౌదరి శ్రీనివాసరావు, రాగోలు జేమ్స్ ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

విగ్రహాలను ధ్వంసం చేసింది మైనర్లే

ప్రజాశక్తి- రేగిడి

రేగిడి మండలం సంకిలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో దేశ నాయకుల విగ్రహాల ధ్వంసం కేసులో అదే గ్రామానికి చెందిన ఇద్దరు మైనర్లను అదుపులోకి తీసుకున్నట్లు సిఐ ఉపేంద్ర తెలిపారు. ఈ మేరకు శనివారం రాజాం సిఐ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థులు, గ్రామస్తులు ఏర్పాటు చేసిన మహాత్మాగాంధీ, అంబేద్కర్, అల్లూరి సీతారామరాజు, స్వామి వివేకానంద తదితర విగ్రహాలను ఈనెల 1న స్వల్పంగా ధ్వంసం చేసినట్టు తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిహెచ్ లక్ష్మీనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రేగిడి పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ ఈ. శ్రీనివాసరావు కేసు నమోదు చేశారని తెలిపారు. విచారణ జరిపి ఇద్దరు మైనర్లుగా గుర్తించామన్నారు. వీరిని అరెస్ట్ చేసినట్టు తెలిపారు. ఈ ఇద్దరు మైనర్‌లను విజయనగరం బాలుర న్యాయ సదరానికి తరలించినట్లు తెలిపారు.

హామీలన్నీ నెరవేర్చాం

ఎమ్మెల్యే శంబంగి

మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి

ప్రజాశక్తి-బాడంగి

ఎన్నికల ముందు సిఎం జగన్ ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చామని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు అన్నారు. శనివారం బాడంగిలో గృహ సారథులకు ఏర్పాటుచేసిన శిక్షణ కార్యక్రమంలో నాయన మాట్లాడారు. 33 సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అర్హత కలిగిన ప్రతి లబ్ధిదారునికి నేరుగా వారి ఖాతాలో జమ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైసిపి నియోజకవర్గ నాయకులు శంబంగి వేణు గోపాల్, ఎఎంసి చైర్మన్ బొమ్మి శ్రీనివాస్ రావు, ఇంటి గోపాల్ రావు, జెసిఎస్ మండల కన్వీనర్ మరిపి శంకర్, ఎంపిపి బోగి గౌరి, జెడ్‌పిటిసి పెద్దింటి రామారావు పాల్గొన్నారు.

బొండపల్లి : ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య సూచించారు. శనివారం మండల సముదాయం సమీపంలోని ఓ లేఅవుట్‌లో సచివాలయాల మండల కన్వీనర్ పల్లి రఘు అధ్యక్షతన మండల స్థాయి గృహసారథులు, వాలంటీర్లు, సచివాలయ కన్వీనర్ల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ప్రజా సంక్షేమానికి నిరంతరం పనిచేస్తున్న ప్రభుత్వంపై ప్రతిపక్ష నాయకులు విమర్శలు చేయడం శోచనీయమన్నారు. వాటిని తిప్పికొట్టాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంపిపి చల్ల చలంనాయుడు, జెడ్‌పిటిసి ఆర్.సూర్యప్రకాశరావు, వైసిపి మండల కన్వీనర్ ఈదుబిల్లి కృష్ణ, నారాయణమూర్తిరాజు, తదితరులు పాల్గొన్నారు.

మేట్ల నియామక వివాదాన్ని 3 రోజుల్లో పరిష్కరిస్తాం

కూలీలతో చర్చించిన ఎపిడి శారదాదేవి

సంతపాలెంలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఎపిడి శారదాదేవి

ప్రజాశక్తి-కొత్తవలస

మేట్ల నియామక ప్రక్రియలో వివాదాన్ని మూడు రోజుల్లో పరిష్కరిస్తామని ఉపాధి హామీ ఎపిడి శారదాదేవి హామీనిచ్చారు. సంతపాలెంలో ఉపాధి హామీ మేట్లను ప్రజాస్వామికంగా నియమించాలని, పని చేసిన వారికి అవకాశం ఇవ్వాలని కోరుతూ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యాన గురువారం కలెక్టరేట్ వద్ద కూలీలు ఆందోళన చేపట్టిన విషయం విదితమే. స్పందించిన డ్వామా పీడీ .. విచారణకు ఎపిడిని ఆదేశించడంతో శనివారం ఆమె సంతపాలెం గ్రామానికి వచ్చారు. కూలీలతో మాట్లాడి సమస్యను తెలుసుకున్నారు. వివాదాన్ని సద్దుమణిగించి, కూలీలకు పనులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని వ్యకాస జిల్లా అధ్యక్షులు జి.అప్పారావు కోరారు. మూడు రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని, అంతవరకు సక్రమంగా పనిచేయాలని రెండు గ్రూపుల ఉపాధి కూలీలకు ఎపిడి సూచించారు. అప్పటి వరకు మస్తర్లు ఫీల్డ్ అసిస్టెంట్ వేస్తారని చెప్పారు. కార్యక్రమంలో ఎపిఒ విజయలక్ష్మి పాల్గొన్నారు.

దోపిడీ ప్రభుత్వాన్ని గద్దెదించాలి

టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు సంధ్యారాణి

ప్రజాశక్తి- మెంటాడ

రాష్ట్ర ఖజానాను వైసిపి నాయకులు దోచుకుంటున్నారని, రానున్న ఎన్నికల్లో ఆ పార్టీని గద్దెదించాలని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు గుమ్మిడి సంధ్యారాణి పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని లోతుగడ్డ పంచాయతీలో ఇదేం కర్మ కార్యక్రమం నిర్వహించారు. గిరిజన మహిళలు ఆమెకు హారతులిచ్చి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిత్యావసర ధరలు, గ్యాస్, ఆయిల్ ధరలు పెరగడంతో సామాన్యులు బతకలేని పరిస్థితిలో ఉన్నారని చెప్పారు. గ్రోత్ రేటు పెరిగిందని చెబుతున్న వైసిపి ప్రభుత్వం ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేక, రైతుల నుంచి ధాన్యం కొనలేక కుంటిసాకులు చెబుతోందని విమర్శించారు. నారా లోకేష్ పాదయాత్రకు ప్రజల నుంచి విశేష ఆదరణ వస్తోందని, దాన్ని చూసి ఓర్వలేని వైసిపి నాయకులు తప్పుడు కేసులు పెడుతున్నారని చెప్పారు. ఆంద్ర పంచాయతీకి చెందిన వైసిపి

ఇదేం కర్మ కార్యక్రమంలో మాట్లాడుతున్న సంధ్యారాణి

వైస్ సర్పంచ్ దారి శ్రీను ఆధ్వర్యంలో వంద కుటుంబాలు సంధ్యారాణి సమక్షంలో టిడిపిలో చేరాయి. కార్యక్రమంలో టిడిపి నాయకులు చలుమూరి వెంకటరావు, గెద్ద అన్నవరం, సూరెడ్డి కృష్ణమూర్తి, రెడ్డి ఎర్నాయుడు, పల్లి సింహాద్రి, సిరిపురపు గురునాయుడు తదితరులు పాల్గొన్నారు.

తారకరత్న కోలుకోవాలని పూజలు

ప్రజాశక్తి-కొత్తవలస

నందమూరి తారకరత్న వేగంగా కోలుకోవాలని శనివారం కొత్తవలసలోని మరిడిమాంబ ఆలయంలో టిడిపి నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. టిడిపి మండల అధ్యక్షులు గొరపల్లి రాము ఆధ్వర్యాన చేపట్టిన కార్యక్రమంలో విశాఖ పార్లమెంట్ ఉపాధ్యక్షుడు లెంక శీను, పొలమరశెట్టి జగ్గారావు, పి.చిన్నప్ప, కార్యకర్తలు పాల్గొన్నారు.

జామి : జామిలో జమ్మి చెట్టుకు మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, టిడిపి రాష్ట్ర నాయకులు రాంప్రసాద్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా లలితకుమారి మాట్లాడుతూ లోకేష్ పాదయాత్ర విజయవంతం కావాలని కోరారు. కార్యక్రమంలో రామయ్యపాలెం మాజీ సర్పంచ్ మాకిరెడ్డి శ్రీలక్ష్మి, జామి నాయకులు వర్రి రమణ, తదితరులు పాల్గొన్నారు.

వంద కిలోమీటర్లకే ఓర్వ లేకపోతున్నారు

విజయనగరం కోట : 100 కిలోమీటర్లకే నారా లోకేష్ బాబు చేపట్టిన పాదయాత్రను చూసి వైసిపి నాయకులు ఓర్వలేకపోతున్నారని టిడిప నగర పార్టీ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, మండల పార్టీ అధ్యక్షులు బొద్దుల నర్సింగ్ రావు , కర్రోతి నర్సింగరావు దుయ్యబట్టారు. శనివారం అశోక్ బంగ్లాలో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్ బాబు యువగోళం పేరుతో నాలుగు వేల కిలోమీటర్లు 400 రోజులపాటు చేపట్టిన కార్యక్రమానికి ఎన్నడూ లేని విధంగా ఈ రాష్ట్ర ప్రభుత్వం ఆంక్షలు విధించడం సరైనది కాదన్నారు. ఎన్ని ఆటంకాలు సృష్టించినా యువగళం పాదయాత్ర ఆగదని స్పష్టం చేశారు.

వికలాంగుల సంక్షేమానికి పెద్దపీట

ప్రజాశక్తి-బాడంగి

వికలాంగుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేసిందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు అన్నారు. బాడంగి మండలంలో వికలాంగులకు ప్రభుత్వం మంజూరు చేసిన ఉపకరణాలను శనివారం ఆయన పంపిణీ చేశారు. 13మందికి రూ.లక్షా 50 వేలు విలువైన ఉపకరణాలను అందించారు. కార్యక్రమంలో ఎంఇఒ కృష్ణమూర్తి, వైసిపి నాయకులు తెంటు మధు, ప్రత్యేక ఉపాధ్యాయులు కె.ఈశ్వరరావు, ఐఇఆర్‌పి సత్యనారాయణ, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయంలో తనిఖీలు

ప్రజాశక్తి - వంగర

మండలంలోని ఎం.సీతారాంపురం సచివాలయాన్ని ఎంపిడిఒ వావిలపల్లి శ్రీనివాసరావు శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గృహ నిర్మాణశాఖకు సంబంధించిన రిజిస్ట్రేషన్లు, పెన్షన్లు దరఖాస్తులు, చేదోడు పథకానికి సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉద్యోగులంతా సమయపాలన పాటించి స్పందన వినతులు ఎప్పటికప్పుడు పరిష్కారం చేయాలని ఆదేశించారు. ఏదైనా సమస్య ఉంటే తమ దృష్టికి తేవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

సంచార పశువైద్య వాహనం ప్రారంభం

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోని మోపాడ గ్రామంలో డాక్టర్ వైఎస్ఆర్ సంచార పశు ఆరోగ్య సేవలో భాగంగా నూతనంగా మంజూరైన వాహాన్ని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పల నాయుడు శనివారం ప్రారంభించారు. పాడి



సంచార పశువైద్య వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

రైతులు ఈ వాహనాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి బంటుపల్లి వాసుదేవరావు, నెల్లిమర్ల జెడ్‌పిటిసి గదల సన్యాసి నాయుడు, భోగాపురం వైసిపి నాయకులు పడాల భానుప్రకాశ్, డెంకాడ వైస్ ఎంపిపి పిన్నింటి తమ్మినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

11 కేజీల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి -శృంగవరపుకోట

వాహన తనిఖీలు సందర్భంగా శనివారం 11 కేజీల గంజాయి పట్టుబడిందని ఎస్ఐ తారకేశ్వరరావు తెలిపారు. మండలంలోని బొడ్డవర చెక్ పోస్ట్ వద్ద శనివారం వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా అరకు నుండి ఎస్ కోట మోటార్ సైకిల్ పై వస్తున్న ఇద్దరు యువకులు పోలీసులను చూసి మోటార్ బైకును, వారి వద్దనున్న బ్యాగును వదిలేసి పారిపోయారు. పోలీసులు ఆ బ్యాగ్‌ను తనిఖీ చేయగా అందులో 11 కేజీల గంజాయి లభించింది. దీంతో మోటార్ బైక్ ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

హౌసింగ్‌డేలో సమస్యల ఏకరువు

ప్రజాశక్తి-వేపాడ

ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న అధికారులు

మండలంలోని పికెఆర్‌పురం, రామస్వామిపేటలో శనివారం నిర్వహించిన హౌసింగ్‌డే కార్యక్రమంలో లబ్ధిదారులు సమస్యలను ఏకరువు పెట్టారు. పికెఆర్‌పురంలో ఏడుగురికి జగనన్న ఇళ్లు మంజూరైతే, ఒకరు మాత్రమే పునాదులు తీశారు. లోతట్టు ప్రాంతంలో ఇళ్ల స్థలాలు మంజూరు చేయడంతో నివాసయోగ్యంగా లేవని లబ్ధిదారులు అధికారుల వద్ద స్పష్టంచేశారు. రామస్వామిపేటలో 26 మందికి ఇళ్లు మంజూరు చేయగా 9 మంది నిర్మాణాలు చేపట్టారు. మరికొంతమంది పునాదులు తీశారు. ఆరుగురు పనులు ప్రారంభించలేదు. నీటి సమస్య, నిర్మాణ సామగ్రి ధరల పెరుగుదలతో పనులు చేపట్టడం లేదని లబ్ధిదారులు కరాఖండిగా సమావేశంలో తెలిపారు. వెంటనే హౌసింగ్ డిఇ శ్రీనివాసరావు స్పందించి, వైకెపి ఎపిఎంను పిలిచి లబ్ధిదారులకు అవసరమైన రుణాలు మంజూరు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ బిఎస్‌కెఎన్ పట్నాయక్, పిఆర్ జెఇ ఎం.కె.ఆలీ, ఎపిఎం శ్రీనివాసరావు, జెఇ దేవుడుబాబు, పంచాయతీ కార్యదర్శి కె.గంగాధర్, వైసిపి మండల అధ్యక్షులు ఎం.జగన్నాథం, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ ప్రేమ్ కుమార్ పాల్గొన్నారు.

రేగిడి : హౌసింగ్ డే సందర్భంగా జగనన్న కాలనీని మండల ప్రత్యేక అధికారి పరిశీలించి, గ్రామపురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. జగనన్న కాలనీలు ఎన్ని మంజూరయ్యాయని ఎంపిడిఒ గన్నవరపు కాశీ విశ్వనాధరావు, హౌసింగ్ ఎఇ అల్లు సూర్య ప్రకాష్‌రావును అడిగి తెలుసుకున్నారు. జగనన్న కాలనీలో అన్ని రకాల మౌలిక సౌకర్యాలు ఉండేలా పనులు జరిపించాలని సూచించారు. కాలనీ పనులు వేగవంతానికి చర్యలు తీసుకొని ప్రారంభానికి కృషి చేయాలన్నారు. పంచాయతీ కార్యదర్శి గౌరమ్మ, హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్లు శివ, గణపతి ఉన్నారు.

గురుదేవ్ ట్రస్ట్ సేవలు ప్రశంసనీయం

కాకినాడ సీ పోర్ట్స్ సిఇఒ మురళీధర్

ప్రజాశక్తి-కొత్తవలస

వికలాంగుల అభ్యున్నతికి అహర్నిశలు కృషి చేస్తున్న గురుదేవ్ చారిటబుల్ ట్రస్ట్ సేవలు ప్రశంసనీయమని కాకినాడ సీ పోర్ట్స్ సిఇఒ మెర్ల మురళీధర్ కొనియాడారు. మండలంలోని మంగళపాలెంలో ఆ ట్రస్ట్ చైర్మన్ రాపర్తి జగదీష్ బాబు ఆధ్వర్యంలో కాకినాడ సీ పోర్ట్స్ సంస్థ ఆర్థిక సహకారంతో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కాళ్లు, చేతులు కోల్పోయిన లక్షలాదిమందికి అండగా నిలిచారని జగదీష్‌బాబును అభినందించారు. వికలాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలన్నారు. ట్రస్ట్ నిర్వహిస్తున్న ఆసుపత్రి ద్వారా పేదలకు అందిస్తున్న సేవలను అభినందించారు. ట్రస్ట్‌కు తమవంతు సహకారం అందిస్తామని లీడర్ పత్రిక అధినేత రమణమూర్తి ప్రకటించారు. పాతికేళ్లుగా ట్రస్ట్ ద్వారా లక్షా 78 వేల మందికి

కృత్రిమ అవయవాలను అమర్చుతున్న జగదీష్‌బాబు

కృత్రిమ అవయవాలను దాతల సహకారంతో అందించామని జగదీష్‌బాబు తెలిపారు. కాకినాడ సీ పోర్ట్స్ సంస్థ ద్వారా రూ.25 లక్షల విరాళం అందించారని తెలిపారు. అనంతరం 200 మందికి కృత్రిమ కాళ్లు, చేతులు, చెవిటి మిషన్లు, వీల్‌చైర్లు, అంధులకు బ్లెయిండ్ స్టిక్స్, తదితర ఉపకరణాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ వైస్ చైర్మన్ ఫణీంద్ర, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

సఖి గ్రూపులతో బాలికల సాధికారత

ప్రజాశక్తి-వేపాడ

బాలికల సాధికారతకు సఖి గ్రూపులు దోహదం చేస్తాయని ఎంపిడిఒ బిఎస్‌కెఎన్ పట్నాయక్ తెలిపారు. శనివారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో సఖి గ్రూపు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సఖి గ్రూపుల వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో వేపాడ, బొద్దాం పిహెచ్‌సిల వైద్యాధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నెల్లిమర్ల : బాలికలకు సఖీ గ్రూపుల ద్వారా ఆరోగ్యం, పరిశుభ్రత పై మరింత అవగాహన కల్పించాలని మండల ప్రత్యేకాధికారి ఎస్.వి.రమణ మూర్తి సూచించారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సఖీ గ్రూపుల సమావేశం నిర్వహించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ స్రఖీ గ్రూపుల ద్వారా బాలికలకు ఆరోగ్యం, పరిశుభ్రత పై మరింత అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో ఎంపిడిఒ జి. గిరిబాల, నగర పంచాయతి కమిషనర్ పి. బాలాజీ ప్రసాద్, ఎస్ఐ పి. నారాయణరావు, వైద్యాధికారి రవీంద్ర, నెల్లిమర్ల ఐసిడిఎస్ పిఒ ఎం. సత్యవతి, సూపర్ వైజర్లు బి.శకుంతల, జ్యోతి, ఉమా పాల్గొన్నారు.

బొబ్బిలిరూరల్ : మహిళలు అన్ని రంగాల్లోనూ ముందుండాలని ఎంపిపి శంబంగి లక్ష్మి అన్నారు. ఐసిడిఎస్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో సఖి కార్యక్రమం నిర్వహించారు. మార్కెటింగ్ శాఖ ఎడి వైవి శ్యామ్‌కుమార్ మాట్లాడుతూ సఖి కేంద్రం ద్వారా మహిళల రక్షణకు మెరుగైన, పకడ్బందీ సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కేంద్రం సేవలు విస్తృతంగా అందించేందుకు ప్రజలకు ఉద్యోగులందరూ అవగాహన కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి సంకిలి శాంతకుమారి, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ అల్లు భాస్కరరావు, ఎంఇఒ చల్లా లక్ష్మణరావు, ఎపిఒ అప్పలస్వామి, ఐసిడిఎస్ అధికారులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధంతో పర్యావరణ పరిరక్షణ

ప్రజాశక్తి-వేపాడ

పర్యావరణాన్ని పరిరక్షించాలంటే ప్లాస్టిక్‌ను నిషేధించాల్సిన అవసరం ఎంతైనా ఉందని వాసవి క్లబ్ మండల అధ్యక్షులు కొత్త కిశోర్ అన్నారు. వాసవి క్లబ్ జిల్లా గవర్నర్ ఆత్మకూరు సతీష్ పుట్టినరోజు సందర్భంగా శనివారం వల్లంపూడిలో ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కార్యక్రమం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు నాటడం, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటిస్తే ఆరోగ్యంగా ఉంటామన్నారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ కార్యదర్శి వి.సతీష్, ట్రెజర్ కెవిఎస్ నారాయణ, సభ్యులు పాల్గొన్నారు.

శృంగవరపుకోట : ప్లాస్టిక్ సంచుల వాడకం పర్యావరణానికి ప్రమాదకరమని వాసవి క్లబ్ యూత్ జోనల్ చైర్మన్ బాలనాగు శ్రీనివాస్ అన్నారు. జిల్లా గవర్నర్ ఆత్మకూరు సతీష్ పుట్టినరోజు సందర్భంగా వాసవి క్లబ్ యూత్ మండల అధ్యక్షులు ఎ.సాయికుమార్ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ వాడకం వల్ల జరిగే అనర్థాలపై పట్టణంలోని రైతు బజార్ వద్ద ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పట్టణంలోని బస్టాండ్ నుంచి దేవి కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం పట్టణంలోని రైతు బజార్ వద్ద 500 గుడ్డ సంచులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ యూత్ రీజియన్ సెక్రటరీ ఎ.హరీష్ కుమార్, క్లబ్ జనరల్ సెక్రటరీ ఎం.శివకుమార్, కోశాధికారి ఉప్పల విజయకుమార్, గౌరవ అధ్యక్షులు కంచర్ల వెంకటేష్, ఉపాధ్యక్షులు వి.సతీష్ కుమార్ పాల్గొన్నారు.

ప్రాథమిక హక్కులతోపాటు విధులు పాటించాలి

ప్రజాశక్తి- రేగిడి

ప్రాథమిక హక్కులతో పాటు విధులు పాటించి, బాధ్యతగా పనిచేయాలని రాజాం సీనియర్ సివిల్ జడ్జ్ ఎం. బాబు, జూనియర్ సివిల్ జడ్జి పిఎస్‌విబి కృష్ణ సాయి తేజ అన్నారు. ఈ మేరకు శనివారం రాజాం ఆదిత్య జూనియర్ కళాశాలలో న్యాయ సేవాధికార సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులతో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రాథమిక హక్కులు ఎంతో ముఖ్యమన్నారు. చట్టం ముందు అందరూ సమానమేనని చెప్పారు. కుల, మత, వర్గ, వర్ణ, లింగ వివక్షత చూపరాధని అన్నారు. 14 సంవత్సరాల లోపు పిల్లలు ఎవరు ఫ్యాక్టరీలలో పనిచేయరాదన్నారు. ప్రమాదకరమైన ఏ ఇతర ప్రదేశాలలో పనికి నియమించ కూడదదన్నారు. నదులను, వన్యప్రాణులను, ఇతర జీవులను సంరక్షించాలన్నారు. ప్రకృతి ఆరాధించి అడవులను, సరస్సులను, నదులను వన్యప్రాణులను కాపాడాలన్నారు. ఈ సదస్సులో న్యాయవాదులు రెడ్డి విజయ్ కుమార్, ముదిరి శ్రీనివాసరావు, శ్రీహరి నాయుడు, గోపాల్, మురళీకృష్ణ, రామకృష్ణారావు తదితరులు ఉన్నారు.